
బెంగళూరులో కరెంటు కోతలకు నిదర్శనం ఈ చిత్రం


మంత్రి శివానంద్ పాటిల్ కాళ్ల కింద కరెన్సీ నోట్లు

# అటు కటిక చీకట్లు.. ఇటు కరెన్సీ వెలుగులు

కరెంటు కోతలు ఒకవైపు.. కరువు రక్కసి మరోవైపు.. రైతన్న బలవన్మరణాలు ఒకవైపు.. ప్రజల హాహాకారాలు మరోవైపు..
ఇవేమీ పట్టించుకోకుండా.. నోట్ల వర్షంలో మంత్రిగారి జల్సాలు
ఆ మంత్రి ఎవరో కాదండోయ్.. రైతుల ఆత్మహత్యలను కూడా నాటకంగా చిత్రీకరించిన శివానంద్ పాటిల్..
ఐదు నెలల్లో కర్ణాటకను కాంగ్రెస్ ఎలా భ్రష్టుపట్టించిందో ఈ ఉదాహరణలు చాలేమో!

- నోట్ల వర్షంలో తడిసిన కర్ణాటక మంత్రి శివానంద్
- కాళ్లకింద నోట్లు పడ్డా పట్టించుకోకుండా జల్సా
- వేదికగా మారిన హస్తం పార్టీ నేత కొడుకు పెండ్లి
- మంత్రి చేష్టలపై కన్నడిగులు, విపక్షాల మండిపాటు
- సమస్యలు పట్టించుకోకుండా జల్సాలేంటని ప్రశ్న
- గతంలో రైతుల ఆత్మహత్యలను కించపరిచిన మంత్రి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు(నమస్తే తెలంగాణ): కరెంటు కోతలతో కన్నడ ప్రజలు అల్లాడిపోతున్నారు. విద్యుత్తు కోతలతో ఎండిన పంటలు చూడలేక రైతన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అట్టపెట్టెల్లో దొరుకుతున్న కోట్ల కట్టలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఐదు నెలల్లోనే కర్ణాటకను కకావికలం చేసిన కాంగ్రెస్ నేతలు మాత్రం కరెన్సీ నోట్ల వర్షంలో జల్సా చేసుకొంటున్నారు. హాహాకారాలు చేస్తున్న ప్రజల బాధలను పట్టించుకోకుండా.. విందులు, వినోదాల్లో మునిగితేలుతున్నారు.

**మంత్రి ఉల్లాసం ఇలా..**

గుల్బర్గా కాంగ్రెస్ నాయకుడు అయాజ్ ఖాన్ కుమారుడి వివాహ వేడుక గత ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. దీనికి కర్ణాటక చెరుకు అభివృద్ధిశాఖ మంత్రి శివానంద్ పాటిల్ హాజరయ్యారు. వేడుకలో హాజరైన మంత్రిపై అక్కడి ఓ గుంపు రూ. 500 నోట్లను ఎగురవేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కిందపడ్డ కరెన్సీ నోట్ల మీదనే మంత్రి దర్జాగా కాళ్లు పెట్టుకోవడం విమర్శలకు దారితీస్తున్నది.

**నేనేమైనా నోట్లు విసిరానా?? జస్ట్, కూర్చున్నా..**

నోట్లవర్షంలో మంత్రి తడవడంపై ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలు మండిపడ్డాయి. కర్ణాటకలో కలెక్షన్ బిజినెస్‌ను చేసి, మంత్రిగారు ఇలా కరెన్సీ వర్షంలో సేదతీరుతున్నారని ధ్వజమెత్తాయి. 'రాష్ట్ర ప్రజల సొత్తును లూటీ చేసి, ఎలా సేదతీరాలో మంత్రి శివానంద్ చక్కని షో వేసి చూపించారు' అంటూ బీజేపీ ఎక్స్ వేదికపై చురకలు అంటించింది. సర్వత్రా విమర్శలు వ్యక్తమవ్వడంతో శివానంద్ ఎట్టకేలకు స్పందించారు. తానేమీ కరెన్సీని వెదజల్లలేదని, పెండ్లి వేడుకలో కూర్చొనిఉండగా అలా జరిగిపోయిందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇదే విషయమై సీఎం సిద్ధరామయ్యను ప్రశ్నించగా.. ఈ విషయంపై సదరు మంత్రిని అడిగి వివరాలు తెలుసుకుంటానన్నారు.

### ఎక్కువ పరిహారం కోసమే నాటకాలు!

వివాదాల్లో చిక్కుకోవడం మంత్రి శివానందకు కొత్తేంకాదు. రైతుల ఆత్మహత్యలపై కూడా ఆయన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా లేదా వేర్వేరు కారణాలతో జరిగిన రైతుల మరణాలను ఆత్మహత్యలుగానే చిత్రీకరిస్తూ కొందరు రైతుసంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని శివానంద్ గత నెలలో ఆరోపించారు. బాధిత రైతు కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం ప్రభుత్వం నుంచి అందడమే దీనికి కారణమని చెప్పుకొచ్చిన ఆయన.. ఎక్కువ మొత్తంలో పరిహారాన్ని రాబట్టడానికే రైతు నేతలు ఇలా చేస్తున్నట్టు వెల్లడించారు.

# 90 కాదు.. 1000 కోట్లు!


కర్ణాటకలో ఇటీవల వెలుగుచూసిన స్కాంగ్రెస్ కోట్ల కట్టల బాగోతం గురించి ఆ రాష్ట్రంలో దుమారం రేగుతున్నది. ఐటీ అధికారుల సోదాల్లో బయటపడింది రూ.90 కోట్లేనని, నిజానికి ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం హస్తం పార్టీ రూ.వెయ్యి కోట్లకు పైగా సొమ్మును సమీకరించినట్టు సమాచారం. తెలంగాణ ఎన్నికల్లో పంపిణీ చేయడానికే తొలివిడుతలో రూ.300 కోట్లను పక్కకుపెట్టిందని, అయితే ఊహించని విధంగా ఐటీ దాడుల్లో 90 కోట్లు పట్టుబడటంతో కాంగ్రెస్‌కు ఊహించని షాక్ తగిలిందని కన్నడ రాజకీయ వర్గాల్లో పెద్ద యెత్తున చర్చ జరుగుతున్నది. మిగతా రూ. 910 కోట్లను లక్షిత ప్రాంతాలకు ఎలా చేర్చాలన్న దానిపై హస్తం పార్టీ కొత్త స్కెచ్‌లకు ఇప్పుడు తెర తీస్తున్నదని తెలుస్తున్నది.

**కర్ణాటకలో నగదు దుమారం**

**బెడిసికొట్టిన కాంగ్రెస్ నోట్ల కట్టల స్కామ్**

**ఐదు రాష్ట్రాలకు వెయ్యి కోట్ల పంపిణీ లక్ష్యంగా పకడ్బందీగా స్కాంగ్రెస్ స్కెచ్**

- తొలి విడుతలో తెలంగాణకు 300 కోట్లు
- అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లు
- ఆకస్మిక సోదాల్లో 90 కోట్లు పట్టుకొన్న ఐటీ
- మిగతా సొమ్మును ఎలా బట్వాడా చేయాలన్న దానిపై హస్తం తర్జనభర్జనలు
- టెండర్ల రద్దుతో కడుపుమండిన కాంట్రాక్టర్లే ఐటీకి ఉప్పందించారా?
- కాంగ్రెస్ అవినీతి చిట్టాపై ప్రస్తుతం కన్నడ ప్రజాక్షేత్రంలో జరుగుతున్న చర్చ ఇది



### ఐదు రాష్ట్రాలకు పంపిణీ ఇలా..

అధికారుల ద్వారా సేకరించిన సొమ్ములో తొలి విడతలో రూ.1,000 కోట్లను ఐదు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు కాంగ్రెస్ నిర్ణయించిందని అంటున్నారు. తెలంగాణకు రూ.300 కోట్లు, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్,మధ్యప్రదేశ్‌లకు రూ.200 కోట్ల చొప్పున పంపిణీ చేయాలనుకొన్నట్టు సమాచారం. మిగతా రూ. 100 కోట్లను మిజోరానికి కేటాయించినట్టు చెబుతున్నారు. నమ్మకస్తుల వద్ద నాలుగు రోజులు ఉంచి, ఆ తర్వాత లక్షిత రాష్ట్రానికి బట్వాడా చేయాలనుకొన్నట్టు సమాచారం.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు(నమస్తే తెలంగాణ): కర్ణాటకలో ఇటీవల జరిగిన ఐటీ సోదాల్లో పట్టుబడ్డ రూ.90 కోట్ల అక్రమ నగదు కేవలం తీగేనని.. అసలు డొంక ఇంకా కదలాల్సి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పంపిణీ చేయడానికి కాంగ్రెస్ సర్కారు రూ.వెయ్యి కోట్లను అక్రమంగా సమీకరించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కర్ణాటక ప్రభుత్వ కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబీకాపతి ఇంట్లో రూ.42 కోట్లు, మాజీ ఎమ్మెల్సీ కాంతరాజ్‌కు సన్నిహితుడైన బిల్డర్ సంతోశ్ ఇంట్లో రూ.45 కోట్లు పట్టుబడిన విషయం తెలిసిందే. నిందితులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడం, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితులవడంతో కాంగ్రెస్ కోట్ల కట్టల స్కామ్‌కు పాల్పడిందన్న అనుమానాలు పెరిగాయి. ఇప్పటివరకూ పట్టుబడిన డబ్బు ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తరలించడానికి సమీకరించినట్టు సమాచారం ఉందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్ప ఆరోపించడం, అక్రమ సొత్తు సూత్రధారి డీకేనేనని మాజీ సీఎం కుమారస్వామి మండిపడటంతో ఈ అనుమానాలు బలపడ్డాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పంపిణీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ.. కర్ణాటక సర్కారుకు రూ.1,000 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించిందని ప్రస్తుతం కన్నడనాట చర్చ జరుగుతున్నది. అది కూడా తొలి విడుతేనని తెలుస్తున్నది. డబ్బు వసూళ్లు ఎలా చేయాలి? ఎవరి ద్వారా బట్వాడా చేయాలి? ఎలా రాష్ట్రం దాటించాలి? అనే విషయాలపై హస్తంపార్టీ ఓ బ్లూ ప్రింట్‌నే సిద్ధం చేసిందన్న ఆరోపణలు పెద్దయెత్తున వినిపిస్తున్నాయి.

**భస్మాసుర హస్తం**

**గట్టెక్కడం కష్టమని తేలడంతో..**

తెలంగాణతో పాటు మిగతా రాష్ట్రాల్లో గట్టెక్కడం కష్టమనే నిర్ణయానికి వచ్చిన తర్వాతే, కాంగ్రెస్ అక్రమాలకు బ్లూప్రింట్ సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సీఎం కేసీఆర్ సఫలీకృతమయ్యారు. రాష్ట్రప్రజానీకమంతా ఆయన వెంటే ఉన్నట్టు సర్వేలూ చెబుతున్నాయి. దీంతో అక్రమ మార్గంలో ఓటర్లను ఆకర్షించడానికి హస్తం కుట్రకు తెరతీసినట్టు వార్తలు వస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోనూ ప్రజా వ్యతిరేకత, మిజోరంలో పార్టీ ప్రభ మసకబారడంతో కాంగ్రెస్ ఈ స్కామ్‌కు కుట్ర పన్నినట్టు అనుమానిస్తున్నారు.

**అధికారులకు టార్గెట్లు**

'40 శాతం కమీషన్ రాజ్' బీజేపీ సర్కారును గద్దె దించి కర్ణాటకలో పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్.. అంతకు మించి అక్రమాలకు పాల్పడుతున్నది. బెంగళూరు నగరపాలికలో పెండింగ్‌లో ఉన్న సుమారు రెండు వేల కోట్ల రూపాయాల బిల్లులను క్లియర్ చేయడానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారని కర్ణాటక కాంట్రాక్టర్ల సంఘం ఏకంగా రాష్ట్ర గవర్నర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం, వ్యవసాయ శాఖ మంత్రి తమకు నెలనెలా కప్పం చెల్లించాలని వేధిస్తున్నారని అధికారులు ఆరోపించడమే దీనికి ఉదాహరణలు. ఇక, లక్షిత కాంట్రాక్టర్లు, బిల్డర్లు, వ్యాపారుల నుంచి లక్షల రూపాయలను వసూలు చేయాలని అధికారులకు ప్రభుత్వంలోని కొందరు పెద్దలు టార్గెట్లుగా నిర్ణయించినట్టు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే కాంగ్రెస్ వసూళ్ల పర్వం షురూ అయ్యిందని, టార్గెట్ చేరుకోని అధికారులపై ట్రాన్స్‌ఫర్లు, సస్పెన్షన్లు, నోటీసుల పేరిట వేధించేవారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**ఐటీకి ఎలా తెలిసిందంటే?**

ఈనెల 9న ఐదు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడిన నేపథ్యంలో వీలైనంత త్వరగా డబ్బును పంపిణీ చేయాలనుకొన్న స్కాంగ్రెస్‌కు ఐటీ అధికారులు ఊహించని షాక్‌లు ఇస్తున్నారు. మొత్తంగా కర్ణాటకలో రూ.90 కోట్ల వరకూ సీజ్ చేశారు. అయితే, మిగతా రూ. 910 కోట్ల డబ్బు ఇంకా పట్టుబడలేదని, దాన్ని లక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలన్న దానిపై కాంగ్రెస్ పెద్దలు తలపట్టుకొంటున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, బీజేపీ హయాంలో టెండర్లు దక్కించుకొన్న కొందరి కాంట్రాక్టులను కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు రద్దు చేసింది. దీంతో కడుపుమండిన వాళ్లే కాంగ్రెస్ అక్రమాలపై ఐటీకి ఉప్పందించినట్టు పలువురు చెబుతున్నారు.

### డ్యామేజీ నివారణకు..

ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ కర్ణాటకలో పెద్దయెత్తున అక్రమ నగదు పట్టుబడటం, ఈ విషయంలో కాంగ్రెస్ అడ్డంగా దొరికిపోవడంతో పార్టీకి చాలావరకూ డ్యామేజీ జరిగిపోయింది. ఈ క్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం అత్యవసరంగా బెంగళూరుకు వచ్చి.. డీకే శివకుమార్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నష్టనివారణ చర్యల్లో భాగంగానే ఈ భేటీ జరిగిందని, స్కామ్‌లో డీకే పేరు బయటకు రావడంపై కాంగ్రెస్ పెద్దలు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.



### ఖరగ్‌పూర్ ఐఐటీలో మెదక్ విద్యార్థి ఆత్మహత్య

చేగుంట,అక్టోబర్18: ఖరగ్‌పూర్ ఐఐటీలో మెదక్ జిల్లా విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని చెట్లతిమ్మాయిపల్లికి చెందిన అనిత, చందర్ దంపతుల రెండో కుమారుడు కిరణ్ చంద్ర(20) పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఉదయం తాను ఉండే హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

**ఆమెరికాలో రోడ్డు ప్రమాదం..**

### హైదరాబాద్ యువతి మృతి

హైదరాబాద్ సిటీబ్యూరో (నమస్తే తెలంగాణ): ఆమెరికాలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న హైదరాబాద్, నారాయణగూడకు చెందిన ప్రతీక్ష కున్వర్(24) అక్టోబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ప్రియాంక, స్నేహితుడు సాయితేజ, డ్రైవర్ వరుణ్‌తో కలిసి ప్రతీక్ష కారులో వెళ్తుండగా డ్రైవర్ సిగ్నల్‌ను గుర్తించకపోవడంతో చెనీ లేక్ సమీపంలో రెండు వాహనాలు ఢీకొని ప్రమాదం సంభవించిందని మృతురాలి సోదరి ప్రతిభా కున్వర్ తెలిపారు. వరుణ్, సాయి తేజ, ప్రియాంకకు గాయాలయ్యాయని వెల్లడించారు. ప్రతీక్ష మృతదేహాన్ని తీసుకురావడానికి భారత కాన్సులేట్ జనరల్‌ను సంప్రదిస్తున్నటుచెప్పారు.

### సరగసీ మినహాయింపు తగదు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సరగసీ ప్రాథమిక చట్టం నుంచి నిస్సంతు జంటలను మినహాయించడం తల్లిదండ్రులు కావాలనుకునే వారి హక్కును ఉల్లంఘించడమేనని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. చట్టబద్ధంగా, వైద్యపరంగా నియంత్రణ విధానాలు, సేవలకు నిరాకరిస్తున్నందున తల్లిదండ్రులయ్యే వారి ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తుందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# బీజేపీ ఉల్టా.. కాంగ్రెస్ పల్టా

- మధ్యప్రదేశ్‌లో తిరగబడిన రాజకీయం
- సీఎం అభ్యర్థిని ప్రకటించలేని స్థితిలో కమలం పార్టీ
- ఏ క్షణమైనా ముక్కలు చెక్కలయ్యే స్థితిలో బీజేపీ
- ముందు జాగ్రత్తగానే సీఎం అభ్యర్థిపై గోప్యత
- నెల ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్
- ఎన్నికల్లో కమల్‌నాథ్‌పైనే హస్తం పార్టీ ఆశలు


చౌహాన్ కమల్‌నాథ్




భోపాల్, అక్టోబర్ 18: మధ్యప్రదేశ్‌లో రాజకీయం రసవత్తరంగా సాగుతున్నది. దాదాపు రెండు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న బీజేపీకి, ఈసారి సొంత పార్టీ నేతలే చుక్కలు చూపిస్తున్నారు. బీజేపీ రాష్ట్రశాఖ ఎప్పుడైనా ముక్కలయ్యేలా ఉండటంతో 15 ఏండ్లలో తొలిసారి ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండా గోప్యత పాటిస్తున్నది. అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు నెల ముందుగానే తమ సీఎం అభ్యర్థిగా కమల్‌నాథ్‌ను ప్రకటించి, ఎన్నికల్లో పార్టీని గెలిపించే పూర్తి బాధ్యతను ఆయన చేతుల్లో పెట్టింది. ఎప్పుడూ సీల్డు కవర్‌లో సీఎంలను ప్రకటించే ఆ పార్టీ, అందుకు విరుద్ధంగా ఈసారి ముందుగానే అభ్యర్థిని ప్రకటించింది.

**భయంలో బీజేపీ**

మధ్యప్రదేశ్‌లో 2003 నుంచి బీజేపీనే అధికారంలో ఉన్నది. 2018లో కాంగ్రెస్ గెలిచినా ఆ ప్రభుత్వాన్ని కూలగొట్టి దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకొన్నది. 2003 ఎన్నికల్లో తొలిసారి బీజేపీ తన సీఎం అభ్యర్థిగా ఆ పార్టీ ఫైర్ బ్రాండ్‌గా ముద్ర పడిన ఉమాభారతిని ప్రకటించింది. సీఎం అభ్యర్థిని ఎన్నికలకు ముందే ప్రకటించి సానుకూల ఫలితం రాబట్టింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో శివరాజ్‌సింగ్‌ను సీఎం అభ్యర్థిగా ఎన్నికలకు ముందే ప్రకటించింది. అంతే కాదు.. అభ్యర్థుల ఎంపికలోనూ ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. మొదటి రెండు పర్యాయాలు పార్టీని విజయతీరాలకు చేర్చిన ఆయన, 2018లో మాత్రం విఫలమయ్యారు. అయినా, కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి మళ్లీ సీఎం అయ్యారు. అయితే, పార్టీ అధిష్ఠానం ఈసారి వ్యూహం మార్చింది. వచ్చే నెల 17న జరిగే ఎన్నికలకు ఆ పార్టీ ఇప్పటివరకు సీఎం అభ్యర్థిని ప్రకటించలేదు. అంటే ఒక వేళ బీజేపీ గెలిచినా ప్రస్తుత సీఎం శివరాజ్ సింగ్‌కు మరోసారి అవకాశం గ్యారెంటీ కాదని సంకేతాలిచ్చింది. ఒకవేళ ఈసారి బీజేపీ గెలిస్తే సీఎం అభ్యర్థిగా కేంద్రమంత్రి కైలాశ్ విజయ్‌వర్గియాకు సీఎం అయ్యే అవకాశం రావచ్చని పేర్కొంటున్నారు.

### వ్యూహం మార్చిన కాంగ్రెస్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ అధిష్ఠానం సీల్డు కవర్‌లో సీఎం అభ్యర్థి పేరును పంపటం ఆనవాయితీ. అందుకే కాంగ్రెస్ సీఎంలను సీల్డు కవర్ సీఎంలు అంటారు. అన్ని స్థాయిలో పార్టీపై పట్టు సడలకుండా చూసుకొనేందుకు అధిష్ఠానం ఈ విధానాన్ని అనుసరించేది. కానీ, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఈసారి వ్యూహం మార్చింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే గాంధీల కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కమల్‌నాథ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించింది. 2018లో కూడా ఆయనే సీఎం అయ్యారు. కానీ, సింధియా తిరుగుబాటు చేసి బీజేపీలో చేరటంతో కమల్‌నాథ్ అధికారం మూణ్నాళ్ల ముచ్చటగానే ముగిసిపోయింది. ఈసారి కూడా కాంగ్రెస్ ఆయనపైనే నమ్మకం పెట్టుకొన్నది. ఒక్క మధ్యప్రదేశ్‌లో మాత్రమే సీఎం అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ సహా మిగతా ఎన్నికల రాష్ట్రాల్లో సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం.

### ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

**బీజేపీపై శివకుమార్ ఆరోపణలు**

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం శివకుమార్ ఆరోపించారు. 'మా ఎమ్మెల్యేలను ఎవరెవరు (బీజేపీ నాయకులు) కలిశారు.. ఏం ఆఫర్ ఇచ్చారు.. అన్నీ తెలుసు. ఆఫర్‌కు లొంగని మా ఎమ్మెల్యేలు తిరిగి నా దగ్గరకు వచ్చి జరిగిందంతా నాతో చెప్పారు. నేను వారితో ఒక్కటే చెప్పా.. ఈ ఆపరేషన్ కమల్‌ని అసెంబ్లీ సాక్షిగా బట్టబయలు చేయాలని సూచించా' అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల మధ్య గ్రూపు తగాదాలు, తిరుగుబాటు వార్తల్ని శివకుమార్ కొట్టిపారేశారు. రాష్ట్ర మంత్రి, కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్ జక్రోలీ, తనకు మధ్య విభేదాలు ముదిరాయన్న వార్తల్లో నిజం లేదన్నారు.

# కేంద్ర ఉద్యోగుల డీఏ 4% పెంపు

- ఈ ఏడాది జూలై 1 నుంచి వర్తింపు
- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనం బోనస్
- యాసంగిలో 6 పంటలకు కనీస మద్దతు ధరల పెంపు
- కేంద్రమంత్రివర్గం కీలక నిర్ణయాలు


అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కరువు భత్యం, యాసంగి పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ మోదీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యాన్ని 4 శాతం పెంచుతున్నట్టు ప్రకటించింది. బుధవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశం 7వ వేతన కమిషన్ సిఫారసులకు ఆమోదం తెలిపింది. 42 శాతంగా ఉన్న ప్రస్తుత డీఏ 46 శాతానికి పెరుగుతుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. పెరిగిన డీఏ ఈ ఏడాది జూలై 1 నుంచే వర్తిస్తుందని, తద్వారా 48.67 లక్షల మంది ఉద్యోగులు, 67.95 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. 2024-25 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి యాసంగిలో 6 పంటలకు కనీస మద్దతు ధర పెంచుతున్నట్టు కేంద్రం తెలిపింది.

**రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్**

78 రోజులకు సమానమైన వేతనాన్ని రైల్వే ఉద్యోగులకు బోనస్‌గా చెల్లించనున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

**గోధుమ మద్దతు ధర రూ.150 పెంపు**

గోధుమలను అధికంగా పండించే రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనుండటంతో గోధుమల కనీస మద్దతు ధరను పెంచడానికి కేంద్రం సిద్ధమైంది. క్వింటాల్ గోధుమ కనీస మద్దతు ధరను రూ.150 చొప్పున పెంచి, రూ.2,275గా నిర్ణయించింది.

**యాసంగి పంటకు మద్దతు ధర పెంపు ఇలా..**

| పంట పేరు | ప్రతి క్వింటాల్‌పై పెంపు | పెరిగిన ఎమ్మెస్పీ ప్రకారం |
|---|---|---|
| గోధుమలు | రూ.150 | రూ.2275 |
| కందులు | రూ.425 | రూ.6425 |
| ఆవాలు | రూ.200 | రూ.5650 |
| పొద్దుతిరుగుడు | రూ.150 | రూ.5800 |
| బార్లీ | రూ.115 | రూ.1850 |
| శెనగ | రూ.105 | రూ.5440 |

### అవయవ దానంలో మహిళలే ముందంజ

**టాప్-3లో తెలంగాణ**

న్యూఢిల్లీ: అవయవ దానం కోసం పురుషుల కన్నా మహిళలే అధికంగా తమ సమ్మతి తెలియజేస్తున్నారు. అవయవ దానం కోసం ఆధార్ ప్రామాణీకరణ సంతకాల కోసం ఇటీవల నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనేజేషన్ (ఎన్ఓటీటీఓ) వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఇందులో సెప్టెంబర్ 16 నుంచి ఇప్పటివరకు 82 వేల మంది అవయవ దానం కోసం ప్రతిజ్ఞ చేశారు. అవయవ దానం కోసం ముందుకొచ్చిన రాష్ట్రాలలో మహారాష్ట్ర (23,369) మొదటి స్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ (18,847), తెలంగాణ (11,564) రెండు, మూడు స్థానాలలో నిలిచాయి.

### చక్కెర ఎగుమతులపై ఆంక్షలు పొడిగింపు

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై ఆంక్షలను మరోసారి పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని, మిగతా షరతుల్లో ఎలాంటి మార్పు లేదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) బుధవారం జారీ చేసిన ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. రానున్న పండుగ సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో చక్కెర నిల్వలను సరిపడా అందుబాటులో ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.

# త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి

- ఒడిశాకు రఘుబర్ దాస్
- రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు



ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఒడిశా గవర్నర్‌గా బీజేపీ నేత, జార్ఖండ్ మాజీ సీఎం రఘుబర్‌దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. నల్లు ఇంద్రసేనారెడ్డి హైదరాబాద్‌లోని మలక్‌పేట నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇక జార్ఖండ్ బీజేపీ నేత అయిన రఘుబర్ దాస్ 2014-19 మధ్య ఆ రాష్ట్ర సీఎంగా ఐదేండ్ల పాటు పనిచేశారు. శిబు సొరెన్ హయాంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. రఘుబర్ దాస్ ప్రస్తుతం బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. కాగా, ఇప్పటికే తెలంగాణకు చెందిన బండారు దత్తాత్రేయ హర్యానా గవర్నర్‌గా ఉన్నారు. ఇంద్రసేనారెడ్డి తరువాత దత్తాత్రేయ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

**1983లో తొలిసారి ఎమ్మెల్యేగా..**

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన నల్లు ఇంద్రసేనారెడ్డి 1956లో జన్మించారు. యువకుడిగా ఉన్నప్పుడే క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించారు. 33 ఏండ్ల వయసులోనే 1983లో బీజేపీ తరపున తొలిసారి మలక్‌పేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985, 1999 ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుంచి గెలుపొందడమేకాగా, అసెంబ్లీలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. 2003-07 వరకు బీజేపీ ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, 2014లో బీజేపీ జాతీయ కార్యదర్శిగా సేవలందించారు. 2020లో బీజేపీ జాతీయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు. ఇటీవలే ఆయన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, చేరికల కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు.

- యూపీలో కొట్టుకున్న బీజేపీ మహిళా కార్యకర్తలు



ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మహిళా కార్యకర్తలు రోడ్డెక్కి ఒకరినొకరు ఇష్టమున్నట్టు కొట్టుకున్నారు. బీజేపీ మహిళా మోర్చా, ఇతర నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జలౌన్ జిల్లాలో ఏర్పాటుచేసిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమం రసాభాసగా మారింది. బీజేపీ మహిళా కార్యకర్తల్లో కొంతమంది నడిరోడ్డుపైకి వచ్చి.. ఒకరి జుట్టు మరొకరు పట్టుకొని ఇష్టమున్నట్టు కొట్టుకున్నారు. పురుషులు కూడా మహిళల వీపులపై ఇష్టమున్నట్టు బాదారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. యోగి పాలన ఎంత అధ్వానంగా ఉందో ఈ ఘటన తెలుపుతోందంటూ ప్రతిపక్షాలు ఎస్పీ, కాంగ్రెస్, బీఎస్పీ మండిపడ్డాయి. తమ పార్టీ కార్యకర్తలకు సీఎం యోగి ముందు క్రమశిక్షణ నేర్పించాలని సమాజ్‌వాదీ పార్టీ విమర్శించింది.